క్లుప్తంగా

ఘనంగా మత్స్యమాడుగులమ్మ పండుగ



మత్స్యమాడుగులమ్మ తల్లి

జి.మాడుగుల: స్థానిక గంతకొండపై కొలువై ఉన్న మత్స్యరాస వంశీయుల ఇలవేల్పు మత్స్యమాడుగులమ్మ పండుగను భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విజయదశమి అనంతరం వచ్చే మొదటి మంగళవారం మత్స్యమాడుగులమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పలు మండలాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా లక్ష్మణరావు నియామకం



ఎటపాక: మండల సొసైటీ చైర్మన్‌గా పసుపులేటి లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుకు లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. నియామకంపై పార్టీ మండల కమిటీ సభ్యులు, రైతులు తదితరులు అభినందనలు తెలిపారు.

ఇందిరాగాంధీకి ఘనంగా నివాళి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతూరు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చింతూరులో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివన్నారు. . పార్టీ ప్రధాన కార్యదర్శి అహ్మద్ అలీ, రవికుమార్, ప్రసాద్, కన్నయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల ఆర్థికసాయం



ఆర్థిక సాయమందిస్తున్న ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘాలు మంగళవారం ఆర్థిక సాయం చేశాయి. ఉపాధ్యాయ సంఘాలు కలిసి రూ.54,600 వసూలు చేశాయి. ఆయా నగదును మంగళవారం ఎంఈవో-1, 2ల ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు అందజేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.పెద్దబ్బాయి, ఉపాధ్యాయ నేతలు దారబాబు, మురళీకృష్ణ, వెంకటేశ్, సురేష్, కామేశ్వరరావు, శ్యామ్ సుందర్, గణపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎటపాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సెయింట్ ఆన్స్ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్య ఉన్న 30 మంది విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట రామిరెడ్డి, పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్దా ఆదినారాయణ కళ్లద్దాలు అందజేశారు. కన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వర్స బాలకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వెచ్చని నేస్తాలు



సంతలో రగ్గు కొనుగోలు చేస్తున్న గిరిజనులు



అమ్మకానికి తెచ్చిన వివిధ రంగులతో రగ్గులు

- రోజురోజుకు పెరుగుతున్న చలి
- రగ్గులు, స్వెట్టర్లు, జర్కిన్‌లకు డిమాండ్
- వారపు సంతల్లో జోరుగా వ్యాపారం

ముంచంగిపుట్టు: మన్యంలో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతూ గిరిజనులను గజగజ వణికిస్తుంది .దీంతో చలి నుండి రక్షణ పొందేందుకు గిరిజనులు రగ్గులు,స్వెట్టర్లు, శాలువాలు,మంకీ క్యాప్‌లు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. వారపు సంతల్లో ప్రస్తుతం ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. వివిధ రకాల డిజైన్లలో చలినుంచి రక్షణ ఇచ్చే దుస్తులు ఆకర్షణీయమైన రంగులతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. మండలంలో ముంచంగిపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీపురం, భూసిపుట్టు, బంగారుమెట్ట వారపు సంతల్లో పేద, మధ్య తరగతి వర్గాల వారిని టార్గెట్ చేస్తూ స్వెట్టర్లు,మంకీ క్యాప్‌లు, గ్లౌజులు,శాలువాలు,టోపీలు,నోస్‌మాస్కలు,స్కార్ఫ్‌లు,జర్కినిలు ,రగ్గులు దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.ధరలు సైతం అందుబాటులో ఉంచడం వినియోగదారులు ఎగబడుతున్నారు.పిల్లల స్వెట్టర్లు 250 నుంచి 600 రూపాయలు,పెద్దల స్వెట్టర్లు 400 నుంచి 900,శాలువాలు 250 నుంచి 400,స్కార్ఫ్‌లు 50 నుంచి 150,మంకీ క్యాప్‌లు 100 నుంచి 200,బ్లాంకెట్‌లు 300 నుంచి 500 ,గ్లౌజులు 100 నుంచి 150 ,రగ్గులు 600 నుంచి 2000 వరకు ధరలకు అమ్ముతున్నారు.చలి పెరగడంతో వ్యాపారం జోరుగా సాగుతుందని గతంతో పోలిస్తే వ్యాపారం బాగుందని లాభసాటిగా ఉందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటు ధరల్లో

సంతల్లో అమ్ముతున్న స్వెట్టర్లు, జర్కెనిలు,మంకీ క్యాప్‌ల ధరలు అందుబాటులో ఉన్నాయి. మంచి రంగులు,డిజైన్లలో లభ్యమవుతున్నాయి. చలి నుంచి రక్షణకు మంచిగా ఉపయోగపడుతున్నాయి. ఈ ఏడాది చలి చాలా ఎక్కువగా ఉంది.
– ఎస్.పూర్ణచంద్రుడు, మినుములపుట్టు గ్రామం

లాభసాటిగా వ్యాపారం

చలి పెరగడంతో వారపు సంతల్లో వ్యాపారం జోరుగా సాగుతుంది.అన్ని రకాల డిజైన్లతో దుస్తులు ఉన్నాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు కాస్తంత తక్కువ ధరలతో నాణ్యమైన వ్యాపారం చేస్తున్నాం.గతంతో పోలిస్తే ఈ ఏడాది చలి ప్రారంభంలోనే వ్యాపారం లాభసాటిగా ఉంది.
– వి.మహేష్, వ్యాపారి, జోలాపుట్టు గ్రామం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పుల్లంగిలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

మారేడుమిల్లి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను అందిస్తున్నారని, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలోని పుల్లంగి, పాములమామిడి, బూసిగండి, గుపెనగండి, గుండ్రాతి, పీడమర్రి, పూసివాడ, అద్దరివలస, ఎగవలస, చెలకవీధి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు పూలమాలలు హారుతులతో ఎమ్మెల్యే ధనలక్ష్మికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా 350 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికి వెళ్లి యోగక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజల ఆర్థిక సామర్థ్యం పెరిగిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరికే దక్కిందని కొనియాడారు. ఆయా గ్రామాల్లో పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆమె తక్షణమే స్పందించి త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో వివేక్, ఎమ్మార్వో శ్రీనివాసరావు, ఎంపీపీ సార్ల లలిత కుమారి, వైస్ ఎంపీపీ లక్కోండ రవి కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, వైస్ సర్పంచ్ వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), నాయకులు దూడ స్మిత్, సార్ల లింగారెడ్డి అనిదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతనంగా ఎన్నికైనా మండల యూటీఎఫ్ కార్యవర్గం

అనంతగిరి: శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని అనంతగిరి మండలం యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి దేముడు ఆధ్వర్యంలోని నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్.లక్ష్మణరావు, అధ్యక్షుడిగా వి.వి.ఈశ్వరరావు, కార్యదర్శిగా బిడ్డ సింహచలం, కోశాధికారిగా విజయ్ కుమార్, కార్యదర్శులుగా నాగేశ్వరరావు, సోమశేఖర్, పొన్నాలు, దయానిధి, జిల్లా కార్యదర్శులు గంగులు, రాంబాబు, దేముడు, భాస్కరరావు, సత్యనారాయణ, రమణ, అర్జున్ తదితరులను ఎన్నుకున్నారు.పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మారేడుమిల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మారేడుమిల్లి మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కౌన్సిల్ ఎన్నికలకు జిల్లా అధ్యక్షుడు వై. విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి కె.ఆదిరెడ్డి పాల్గొన్నారు. నూతన గౌరవ అధ్యక్షుడిగా కె.ఆంధ్రయ్య, అధ్యక్షులుగా డి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా కె.సల్మాన్ బాబు, డి.దయమని, కోశాధికారిగా కె.పండయ్య, కార్యదర్శులుగా జి.నిర్మల దేవి, బి.అబ్బాస్, జి.త్రినాథ్, వై.దుర్గ వెంకటరెడ్డి, వి.రాజారెడ్డి, ఎ.సుబ్బలక్ష్మి ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో శరభగూడ హౌసింగ్ కాలనీలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి శెట్టి వెంకటరావు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆయనను మంగళవారం కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటానని, తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎప్పుడు ఏ అవసరమైనా తనను సంప్రదించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్(శ్రీను), మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, నాయకులు ముఖి సాంబ, రంజిత్‌కుమార్, యాసిన్, సోమేష్, తిరుపతి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్ది



పూజలు చేస్తున్న మహిళలు



ఒకరికొకరు వాయినాలు అందజేస్తున్న మహిళలు

రాజవొమ్మంగి: అట్లతద్ది పండుగను మంగళవారం వైభవంగా, భక్తి శ్రద్దలతో జరుపుకొన్నారు. సకల సౌభాగ్యాలు కోరుతూ ఇళ్లల్లో గౌరీదేవిని ఆరాధిస్తు జరుపుకొనే పూజలతో ఊరు వాడ ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ పండుగను చంద్రోదయ ఉమా వ్రతం అని కూడా పిలుస్తారు. పూజ అనంతరం అట్లను అమ్మవారికి నివేదించి అనంతరం ఆ అట్లను 11 మంది ముత్తైదువులకు వాయినంగా ఇచ్చారు. రోజంతా ఉపవాసం ఆచరించిన మహిళలు, చంద్రదర్శనం అనంతరం అల్పాహారం తీసుకోని పూజ చేశారు.

స్తంభించిన సిగ్నల్ వ్యవస్థతో ఇక్కట్లు

కొయ్యూరు: బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ వ్యవస్థ తరచూ నిలిచిపోతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రయినా సిగ్నల్ రాలేదు. మండలంలోని అనేక కార్యాలయాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌ను వాడుతున్నాయి. సిగ్నల్ లేకపోవడంతో బ్రాడ్‌బ్యాండ్ పనిచేయడం లేదు. ఫలితంగా కార్యాలయాల్లో పనులు నిలిచిపోతున్నాయి. అటు సిగ్నల్‌లేక ఇటు బ్రాడ్‌బ్యాండ్ పనిచేయక పోవడంతో అత్యవసర సేవల కోసం వచ్చే వారు సైతం అవస్థలు పడుతున్నారు. రాజవొమ్మంగి నుంచి పాత కృష్ణాదేవిపేట వరకు జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో ఆయా ప్రాంతంలో ఏదో ఒక చోట కేబుల్ తెగిపోతుందని, దీనిని వెంటనే సరిచేయడం లేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సొస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నకిలీ వస్తువులు విక్రయిస్తే చర్యలు



దూకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు

జి.మాడుగుల: మండల కేంద్రంలో సంతబయలు గ్రామంలో మంగళవారం జరిగిన వారపు సంతలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు గడ్డంగి రమేష్, కార్యదర్శి కిముడు రమేష్, జాయింట్ సెక్రటరీ బాలరాజు తదితరులు సందర్శించారు. దుకాణాల్లో సరకులు తనిఖీ చేశారు. కాలం చెల్లిన వస్తువులు, నకిలీ వస్తువులు, మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మీయ సన్మానం



పదవీ విరమణ చేసిన టీచర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో బాబురావ్ పడాల్, ఉపాధ్యాయులు

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ వేస్తల గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం శారదాదేవికి ఎంఈవో బాబురావ్ పడాల్ మరియు ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు. వేస్తల ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎంగా 2023 జూన్ నెలలో పదవీ బాధ్యతలు చేపట్టారు. శారదాదేవి ఆరోగ్య పరమైన సమస్యలు కారుణంగా స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



డి.చింతలవీధిలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటపూర్ణిమ, నాయకులు

హుకుంపేట: మండల కేంద్రంలోని డి.చింతలవీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.4లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజి పనులు చేపట్టేందుకు నిధులు మంజురైనట్టు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు అనిల్, సూరిబాబు,వార్డు సభ్యులు రత్నకుమారి, మచ్చమ్మ, నాయకులు రామయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



భీమవరంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం



వాలసీలో జగనన్న ఆరోగ్య సురక్షలోని గిరిజనులు, నాయకులు, తదితరులు

హుకుంపేట: గిరిజనులు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని భీమవరం పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంబించారు. శిబిరానికి వచ్చిన రోగుల ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతు గ్రామాల్లో గిరిజనులు మూడనమ్మకాలు కలిగి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఏర్పడిన ఆస్పత్రులకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తు, ఆరోగ్యం విషమించి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇకనైన ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ,గ్రామల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలించి చిరుధాన్యల పంటలు చేస్తు వాటిని వినియోగించుకోవాలని అన్నారు. వైద్యాధికారులు డాక్టర్ అనుషా, డాక్టర్ గాయత్రి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కంబిడి చిన్నబ్బి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఎస్.కొండలరావు, ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి, డీటీ రంగారావు సర్పంచ్‌లు వైని సన్నిబాబు, టి.సత్యానారాయణ, ఎంటీటీసీలు వైని రజని, కొర్ర నాగరాజు, నాయకులు సూర్యం, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని వాలసీ పంచాయతీ కేంద్రంలోని మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షకు గిరిజనులకు నుంచి విశేష స్పందన లభించింది. లంగుపర్తి, అనంతగిరి పీహెచ్‌సీల వైద్యాధికారిని మంజుభార్గవి, జ్ఞానేశ్వరీ గిరిజనులకు వైద్య సేవలను అందించి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను అందించారు. వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, సర్పంచ్ సన్యాసిరావు, నాయకులు గురుమూర్తి, సన్యాసిరావు, నాగేశ్వరరావు, మధుసూదన్, గంగరాజు, వలంటీర్ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం



రాజవొమ్మంగిలో జాతీయ సమైక్యత ర్యాలీలో గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు

రాజవొమ్మంగి: జాతీయ సమైక్యత దినోత్సవం (సర్ధార్ వల్లభభాయి పటేల్ జయంతి ఉత్సవాలు) సందర్బంగా మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సలోమి ఆధ్వర్యంలో బాలికలు భారీ జాతీయ జెండాను పట్టుకొని ఊరేగారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో, ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ సమైక్యత దినోత్సం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు నేతృతంలో ఘనంగా జరిగాయి. అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడికతీత పనులు



ఒట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువలో యంత్రం సాయంతో పూడిక తీస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట నుంచి వట్టిగెడ్డ వరకు గల దాదాపు 3 కిలోమీటర్ల పొడవుగల వట్టిగెడ్డ పంట కాలువ పూడికతీత పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పంట కాలువ పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ గ్రామాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఇటీవల రాజవొమ్మంగి వచ్చిన ఎమ్మెల్సీ అనంతబాబుకు రైతులు సమస్యను విన్నవించారు. ఆయన స్పందించి పంటకాలువ పూడిక తీత పనులు చేపట్టేందుకు సొంత ఖర్చులతో యంత్రాలను ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తికానుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రైతులు ఎమ్మెల్సీ అనంతబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి



రంపచోడవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీదేవి తదితరులు



రంపచోడవరంలో పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పంచాయతీ కార్యాలయ సిబ్బంది

రంపచోడవరం: దేశ ప్రజలను ఏకం చేసిన ఉక్కుమనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ ప్రతిపౌరుడు గుర్తుచేసుకునే బాధ్యత అందరిపై ఉందని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణం నుంచి జాతీయ ఐక్యత దినోత్సవం పురస్కరించుకొని మంగళశారం జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్యతో కలిసి త్రి కే రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీపీ బంధం శ్రీదేవి మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం దేశ ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి బ్రిటిష్ వారిపై పోరాటంలో కీలక పాత్ర పోషించినటువంటి భారతదేశపు ఉక్కుమనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 31న త్రీ కే రన్ స్థానిక ఐటిడిఏ కార్యాలయం నుంచి ఏరియా ఆస్పత్రి వరకు నిర్వహించినట్టు చెప్పారు.వివిధ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగులు త్రీకే రన్‌లో పాల్గొన్నారు.డీడీ జాన్‌రాజ్, తహసీల్దార్ విజయకుమార్, డీఈ చైతన్య, ఎంపీడీవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ ఏక్తా దివాస్ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు సర్ధార్ వల్లబాయ్ పటేల్ ఎంతో కృషి చేశారని తెలిపారు. పటేల్ చిత్రటానికి పూలమాలలు వేశారు.

ఘనంగా అమ్మవారి పండగ



భక్తులతో కలిసి పూజలు చేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతి వి.కోడాపల్లి గ్రామంలో వేముల దుర్గాదేవి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వి.కోడాపల్లి గ్రామంలో స్థానికులు ఏటా పండగను వైభవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు. నాయకులు సోమలింగం, వెంకటరమణ, లక్ష్మినాయుడు, ఆంద్రయ్య పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



గౌరీపరమేశ్వరుల విగ్రహ ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ వినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల విగ్రహానికి ప్రత్యేక అలంకరణతోపాటు పూజలు నిర్వహించా రు. అనంతరం పట్టణ వీధులగుండా ఊరేగించారు. పురవీధులమీదుగా సాగిన ఈ ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, సమితి సభ్యులు బుద్ద శ్రీనివాసరావు, కొణతాల కృష్ణ, బుద్ద శివ పాల్గొన్నారు.